క్లుప్తంగా

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని విద్యాశాఖాధికారి ఎస్.జోరాడు ఉపాధ్యాయులకు సూచించారు. ఎర్రముక్కాం ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో వేడుకలు జరిగే సమయాల్లో బయట ఆహారం తెచ్చిపెట్టవద్దని సూచించారు. మంగళవారం జరిగిన పాఠశాల వేడుకల్లో బయట ఆహారం తిని పది మంది విద్యార్థులు అస్వస్థకు లోనయ్యారని.. ప్రస్తుతం వారికి ఇబ్బంది లేదన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా లఖినేని



లఖినేని శ్రీనివాసులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా లఖినేని శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో నాలుగుసార్లు అధ్యక్షుడుగా పని చేశారు. అసోసియేషన్ భవనంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంటుగా బమ్మిడి నారాయణరావు, సెక్రటరీగా ఉప్పాడ తిరుమలరావు, జాయింట్ సెక్రటరీగా కె.వెంకటరావు, కోశాధికారిగా బి.ధర్మారావు ఎన్నికయ్యారు.

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ



శిక్షణ పొందిన ఈఎంటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈఎంటీలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యూల్‌కు అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఈవో జగన్నాథరావుల పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ ఇచ్చారు. అత్యవసర పెడియాట్రిక్ ఎమర్జెన్సీ మెడికల్ వైద్య సేవలు వివరిస్తూ ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో, ఎటువంటి మందులు అందించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్లలో పనిచేస్తున్న సుమారు 30 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

'వంశధారను విస్తరించాలి'

కంచిలి: నియోజకవర్గ రైతాంగానికి అవసరమైన వంశధార జలాలను ఇచ్ఛాపురం వరకు విస్తరించే అంశాన్ని రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వారి మ్యానిఫెస్టోల్లో చేర్చించాలని నియోజకవర్గం రైతుకులం ప్రతినిధి, వంశధార జలసాధన కమిటీ కార్యదర్శి దేశెట్టి దాలిబంధు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం కంచిలిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 80 శాతం మంది రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

కంచిలి: మండపల్లి గ్రామంలోని వృద్ధాశ్రమం ఆవరణలో దివ్యాంగుల చిన్నారుల పునరావాస కేంద్రం నిర్మాణానికి సోంపేట ఉన్నత పాఠశాలలో 1993–94 పదో తరగతి పూర్వ విద్యార్థులు తమవంతుగా ఆర్థిక సాయాన్ని అందించారు. 12,500 రూపాయలను సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్‌కు బుధవారం అందించారు. దీనిపై ఆయన పూర్వవిద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు.

లజపతిరాయ్‌కు మాతృవియోగం



సుశీలమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ తల్లి సుశీలమ్మ (89) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సొంత గ్రామం టెక్కలి మండలం తలగాం గ్రామంలో గురువారం ఉదయం అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

కాశీబుగ్గ: పలాస మండలం మోదుగులపుట్టి గ్రామ కొత్తవీధికి చెందిన ఆర్మీ జవాన్ మద్దిల జోగారావు అంత్యక్రియలు గురువారం ఉదయం జరగనున్నాయి. జమ్మూకశ్మీర్ రాష్ట్రం ఉదంపూర్ ఆర్మీ యూనిట్‌లో జేసీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన సోమవారం రాత్రి మరణించారు. మృతదేహాన్ని సంబంధిత అధికారులు ఇక్కడకు తీసుకొని వస్తున్నారు. అధికార లాంఛనాలతో జోగారావు అంత్యక్రియలు నిర్వహిస్తారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



సంతబొమ్మాళిలో ప్రచారం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్



సంతబొమ్మాళి: దివ్యాంగురాలితో ఆత్మీయంగా మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి మరోసారి గెలిపించుకుందామని నాయకులు పిలుపునిచ్చారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం చేసి ఓట్లను అభ్యర్థించారు. టెక్కలి నియోజకవర్గ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ మండల కేంద్రమైన సంతబొమ్మాళిలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి వచ్చిన ఆత్మీయ నేతకు గ్రామ ప్రజలు జేజేలు పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, స్థానిక సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు దూబ లక్ష్మి, శిమ్మ రవణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్, నాయకులు ఎస్.రామిరెడ్డి, పి.రవికుమార్‌రెడ్డి, ఎం.అప్పారావు, నక్క భీమారావు, పి.రామకష్ణ, ఎం.నాగభూషణరావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.రామిరెడ్డి, జె.బాబూరావు, బి.మోహన్‌రెడ్డి, గొలుసు సవరయ్య ఉన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఉద్దానం అభివృద్ధి

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందిందని పార్టీ నాయకులు అన్నారు. ఉద్దాన గ్రామాలైన మర్రిపాడు, దున్నవూరు, నొల్లూరు, చిన్నదున్నవూరులో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు తెప్పల ఉమాపతి, ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సొర్ర ఢిల్లేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, ఏజీకే చైర్మన్ బి.చిన్నారావు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ టి.ప్రసాద్, సూరాడ అప్పారావు, జి.రామస్వామి, కె.కోదండరావు, బి.పురుషోత్తం, పి.లక్ష్మీనారాయణ ఉన్నారు.



మందస ప్రచారం చేస్తున్న నాయకులు



కాశీబుగ్గ: ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ జోగి సతీష్ తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: రిట్టపాడులో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

వజ్రపుకొత్తూరు రూరల్: అందరి మేలు కోసం నిత్యం పరితపించే నాయకులకు రానున్న ఎన్నికల్లో పట్టం కడుదామని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, సీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. బాతుపురం పంచాయతీ రిట్టపాడు, కిడిసింగి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మంత్రి సీదిరి అప్పలరాజుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు నర్తు లక్ష్మీనారాయణ, నర్తు శేషయ్య, నర్తు ప్రేమ్‌కుమార్, ఇరోతు హేమంత్, పైల అప్పారావు, జోగి అప్పారావు, ఉమామహేశ్వరరావు,అప్పారావు ఉన్నారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 31వవార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ జోగి సతీష్ ఆధ్వర్యంలో పలాస ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక ఓట్లు మెజారిటీతో గెలిపించాలని కోరారు. గౌరీ శంకర్ భవనం నుంచి సీతారాంనగర్ వరకు తొమ్మిది వీధులలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు నర్తు వెంకటరమణ, కిర్రి బాబూరావు, ఐతి ఈశ్వరరావు, నంబాళ్ల రమేష్, సువర్ణపురం కిరణ్‌కుమార్, ఉర్బాన వెంకటరావు, వాసు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



మందస అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మందస: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో అరసాడ రఘుపతిరావు, సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు కోరారు. మందస పట్టణంలో నీఓటు.. నీ భవిష్యత్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు తప్పని సరిగా వేయాలన్నారు. శతశాతం ఓటింగ్ జరగాలన్నారు. ఓటే బలమైన ఆయుధమని, ఓటు వేయండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం చేపట్టి ఓటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో బూరగాన బుష్యేశ్వరరావు, సీసీలు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



నందిగాంలో బైక్‌ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

నందిగాం: ఓటు వజ్రాయుధమని వక్తలు అన్నారు. ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా నందిగాంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో నందిగాం నుంచి కణితూరు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సోంపేట: గాంధీనగర్‌లో అవగాహన ర్యాలీ

సోంపేట: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సోంపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ సోంపేట పట్టణంలోని గాంధీనగర్ వీధిలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. ఏపీఎం రమణమ్మ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబడలో ర్యాలీ చేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: ఓటు హక్కుపై బొడ్డబడ, సన్యాసిపుట్టుగ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వజ్రాయుధమైన ఓటును మనందరం తప్పని సరిగా వినియోగించుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదుకు ముందుకు రావాలని అన్నారు.



కవిటిలో నిర్వహిస్తున్న మానవహారం

కవిటి: ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ కవిటిలో మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం గోవిందరావు, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రహి, గ్రామస్తులు పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం లో ప్రవేశానికి గురువారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత ఉన్నవారు మే 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన వారు రూ. 200లు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందినవారు రూ. 150 చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే ఆధార్‌కార్డు, గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి పాస్ సర్టిఫికెట్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, ప్రవేశరుసుంతో పాఠశాల పని వేళలో వస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామన్నారు. వివరాల కోసం 91774 58429, 90322 20333, 94942 63036 నంబర్లను సంప్రదించాలన్నారు.

మఠం సరియాపల్లి పాఠశాలలో..

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ కోర్సులో ప్రవేశాలకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. వివరాలకు 99859 75684, 83744 33269 నంబర్లను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

కంచిలి: దివ్యాంగ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మండల విద్యాశాఖాధికారి–1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరు మండలాల పరిధిలో దివ్యాంగ విద్యార్థులకు వారికి కావల్సిన పరికరాలపై మెడికల్ శిబిరాన్ని జిల్లా సమగ్రశిక్షా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, మందస, పలాస మండలాలకు చెందిన 209 మంది పరీక్షలు చేయించుకున్నారు. ట్రైసైకిళ్లకు 69 మంది, వీల్ చైర్స్ కోసం 39, రోల్టేక్‌కు 20, కాల్పర్డ్‌కు 15, సీపీ చైర్స్‌కు 25, హియిరింగ్ ఎయిడ్‌కు 40 మంది పరీక్షలు చేయించుకుని ఆయా పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.వి.కె.రవి, ఎంఈఓ–2 కె.చిట్టిబాబు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీతారాంనాయుడు, ఏఎస్ఓ సోమశేఖర్, ఐఈఆర్‌టీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎస్పీ రాధిక



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం పరిధిలో ఉన్నటువంటి పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం పరిశీలించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు తాళ్లబద్ర, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, గుణుపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి రక్షణ ఉంది, దివ్యాంగులకు ర్యాంప్‌ల ఏర్పాటు, రూట్ మ్యాప్ తదితర అంశాలపై సిబ్బంది నుంచి ఆరా తీశారు. వివాదాస్పదంగా ఉండే కేంద్రాల జాబితా పరిశీలించారు. స్థానికంగా ఉన్నటువంటి పోలీసు అధికారులతో సమీక్షించారు.

ముగిసిన పది పరీక్షలు



నగరంపల్లి కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. చివరి రోజున 957 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 929 మంది హాజరు అయ్యారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాశారు. అన్ని కేంద్రాల్లో అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు.

సగర్వంగా నిల'బడి'ంది!



నాడు: శిథిలావస్థలో భయంకరంగా ఉన్న భవనం



నేడు: కొత్త భవనం నిర్మాణం

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల గత టీడీపీ హయాంలో నిస్తేజంగా ఉండేది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో పాఠశాల రూపు రేఖలు మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రగతి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన నాడు–నేడు పథకంలో భాగంగా రెండు విడతలుగా సుమారు 1.80 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. నూతన భవనాలు నిర్మించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నాడు: అసంపూర్తిగా ఉన్న తరగతి గది



నేడు: కొత్త భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



రంగులతో కళకళలాడుతున్న పాఠశాల భవనాలు



డిజిటల్ బోర్డులతో బోధన



మంచినీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం పది గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్‌ఫైన్ కెమికల్స్ ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ, ఎంఎస్సీ, అర్హత గల వారు ఆధార్‌కార్డుతో పాటు విద్యార్హతలు, కులధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

పోలీసుల అదుపులో డీజే వాహనం

టెక్కలి రూరల్: అనుమతి లేకుండా పెద్ద శబ్దంతో డీజే సిస్టంను తరలిస్తున్న వ్యాన్‌ను టెక్కలి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. భగవాన్‌పురం గ్రామానికి చెందిన డీజే సౌండ్ బాక్స్‌ల వ్యాన్ టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద పెద్ద శబ్దంతో పాటలు వేసుకుంటూ స్థానికులను ఆందోళనకు గురి చేశారు. గమనించి పోలీసులు డీజే వ్యాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని ఏఎస్సై టి.నర్సింగరావు తెలిపారు.

ఉపకరణాల పంపిణీకి ఎంపికలు నేడు

టెక్కలి రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారులకు ఉపయోగపడే ఉపకరణాల పంపిణీ కోసం స్థానిక భవిత కేంద్రం అవరణలో టెక్కలి జిల్లా ఆస్పత్రి వైద్యుల సమక్షంలో బుధవారం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెక్కలి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు చెందిన దివ్యాంగు చిన్నారులు సదరన్ ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న అక్కజ్యోస్యుల రమేష్‌శర్మ

సోంపేట: సోంపేట పట్టణంలో శ్రీరామా లక్ష్మీసమేత సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రతిష్ఠామమహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. క్షీరాధివాసం పూజా కార్యక్రమాలు విగ్రహాలకు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త అక్కజోస్యుల రమేష్‌శర్మ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా మూడోరోజు ధాన్యాదివాసం, నాలుగో రోజు పుష్పాదివాసం, ఐదో రోజున ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయనిన ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.